సాక్షి వనపర్తి

శుక్రవారం । 3 । మే । 2024



దేశానికి మోదీ అవసరం

దేశ ప్రజలకు ప్రధాని మోదీ అవసరం ఎంతో ఉందని ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు.

వివరాలు IIలో ▸



నాణ్యతగా ప్రసాద్ స్కీం

ప్రసాద్ స్కీం పనులు నాణ్యత చేపట్టాలని తెలంగాణ పర్యాటకశాఖ ఎండీ ఆదేశించారు.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.8 /27.8

ఉదయం నుంచే ఎండ తీవ్రత కనిపిస్తుంది. మధ్యాహ్నం వేళ ఉక్కపోత పెరుగుతుంది. అప్పుడప్పుడు వడగాల్పులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



కొత్తకోట రూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తకోటకు వచ్చి కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించనున్నారు. సీఎం రాక సందర్భంగా గురువారం ఎస్పీ రక్షిత కె.మూర్తి హెలీప్యాడ్ పనులు, కొత్తకోట చౌరస్తాలో వీవీపీ పార్కింగ్, ట్రాఫిక్ రూట్, వాహనాలు వచ్చి పోయే మార్గాలను పరిశీలించారు. అనంతరం బందోబస్తుకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఏఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ జె.వెంకటేశ్వర్‌రావు, సీఐ రాంబాబు, రిజర్వ్ సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ మంజనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి : నిరంజన్‌రెడ్డి



పెబ్బేరు రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు. గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి శ్రీరంగాపురంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. పట్టణంలో తిరిగి ప్రజలు, పండ్లు, కూరగాయలు, టీకొట్టు, వ్యాపారులను కలిసి బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి ప్రజలకు అందించామన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తోందని తెలిపారు. ఆయన వెంట వాకిటి శ్రీధర్, ఎంపీపీ గాయత్రి, విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, నాయకులు వెంకటయ్య, గౌడ్‌నాయక్, పృథ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

రామన్‌పాడులో నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం 1,012 అడుగుల నీటిమట్టం ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా నీటి సరఫరా లేదని, తాగునీటి అవసరాలకు రిజర్వాయర్‌లోని 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్

అమరచింత: పురపాలికలోని తొమ్మిదోవార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి గురువారం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజగౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పురపాలికలో జరిగిన అవినీతిపై చైర్‌పర్సన్‌ను నిలదీయడంతో బీఆర్‌ఎస్ నుంచి రాజశేఖర్‌రెడ్డిని బహిష్కరించారు. అవినీతిపై పోరాటమే లక్ష్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

హే.. భగవాన్

పలు మండలాల్లో రెడ్ అలర్ట్‌కు చేరుకున్న ఉష్ణోగ్రతలు

- ఉమ్మడి జిల్లాలో నేడు, రేపు మరింత పెరిగే అవకాశం
- తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక
- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని నిపుణుల సూచన

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో 46.0, కొల్లాపూర్ 46.0 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. వెల్దండ, కల్వకుర్తి, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, చిన్నచింతకుంట, నారాయణపేట జిల్లాలోని ధన్వాడ, కృష్ణా, కొత్తపల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి, అయిజ, అలంపూర్ మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై.. రెడ్ అలర్ట్‌కు చేరింది. ఈ నెల 4, 5 తేదీల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మరిన్ని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 5 వరకు ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జో.గద్వాల, నారాయణపేట జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరో రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెడ్ అలర్ట్ స్థాయికి చేరుకుంటాయని చెబుతోంది. ఆదివారం వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తీవ్రమైన వడగాల్పులు ఉంటాయని.. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కాగా.. ఈ ఏడాది 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

45 డిగ్రీలు దాటితే..

ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నెల ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో అత్యధికంగా 45.1 డిగ్రీలు, చిన్నచింతకుంట 45.0, నారాయణపేట జిల్లా కృష్ణాలో 45.2, ధన్వాడలో 45.1, కొత్తపల్లి మండలంలో 45, గద్వాల జిల్లాలో వడ్డేపల్లి 45.7, అయిజ 45.2, అలంపూర్ 45, నాగర్‌కర్నూల్ జిల్లాలో వంగూరు, కొల్లాపూర్ 46.0, వెల్దండ 45.4, కల్వకుర్తి 45.0 డిగ్రీలతో రెడ్ అలర్ట్ చేరుకున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మండుటెండలో పనిచేసే కూలీలు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరుకోవడంతో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదని నిపుణులు సూచిస్తున్నారు. దాహంతో సంబంధం లేకుండా రోజంతా తగినంత నీరు, నిమ్మకాయ నీరు, మజ్జిగ లాంటి ద్రావణాలను తరచుగా తీసుకోవాలని చెబుతున్నారు.

గురువారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతల వివరాలు..

నాగర్‌కర్నూల్ జిల్లాలో..		మహబూబ్‌నగర్ జిల్లా..	
మండలం	ఉష్ణోగ్రతలు	మండలం	ఉష్ణోగ్రతలు
వంగూరు	46.0	జడ్చర్ల	45.1
కొల్లాపూర్	46.0	చిన్నచింతకుంట	45.0
వెల్దండ	45.4	బాలానగర్	44.9
కల్వకుర్తి	45.0	మహబూబ్‌నగర్	44.4
బిజినేపల్లి	44.5	అడ్డాకల్	44.0

నారాయణపేట జిల్లా..		వనపర్తి జిల్లా..		జో. గద్వాల జిల్లా..	
మండలం	ఉష్ణోగ్రతలు	మండలం	ఉష్ణోగ్రతలు	మండలం	ఉష్ణోగ్రతలు
కృష్ణా	45.2	మదనాపురం	44.8	వడ్డేపల్లి	45.7
ధన్వాడ	45.1	ఖిల్లాఘనపూర్	44.6	అయిజ	45.2
కొత్తపల్లి	45.0	కొత్తకోట	44.5	అలంపూర్	45.0
దామరగిద్ద	44.8	పాన్‌గల్	44.2	ఇటిక్యాల	44.9
నర్వ	44.7	గోపాల్‌పేట	44.0	ధరూర్	44.8

5న రాహుల్‌గాంధీ రాక

- ఎర్రవల్లి చౌరస్తాలో భారీ బహిరంగసభ
- ఏర్పాట్లను పరిశీలించిన సంపత్‌కుమార్, మల్లు రవి



ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జోగుళాంబ గద్వాల జిల్లాకు రానున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 5న ఎర్రవల్లి మండలకేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి, జోగుళాంబ గద్వాల జిల్లా జెడ్పీచైర్‌పర్సన్ సరిత గురువారం సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఎర్రవల్లిలో లక్షమందితో భారీ బహిరంగసభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారం చేపట్టినట్లుగానే కేంద్రంలో కూడా అధికారం చేపట్టేలా దేశవ్యాప్తంగా చేపట్టనున్న సంక్షేమ పథకాలతో పాటు ఐదు గ్యారంటీల గురించి రాహుల్ ప్రకటిస్తారని చెప్పారు. అలాగే ఈ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి గురించి సీఎం రేవంత్ వివరిస్తారని తెలిపారు. సభకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని గద్వాల, అలంపూర్, వనపర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఎర్రవల్లిలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సంపత్ కుమార్, మల్లు రవి, సరిత తదితరులు

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

అమరచింత: దేశంలోని అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించి ఆదుకున్న ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కిందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపురం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని పదేళ్లు పాలించిన బీజేపీ మతోన్మాదాన్ని ప్రేరేపించడం తప్పా ప్రజలను ఆదుకుని అభివృద్ధిపర్చిన ఘటనలు లేవన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్మడం, రైతులకు అందించే రాయితీలను ఎత్తివేయడంతోనే కాలం గడిపిందని ఆరోపించారు. ఈసారి అవకాశం ఇస్తే రిజర్వేషన్లు ఎత్తివేయడం, రాజ్యాంగాన్ని మార్చే కుతంత్రాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి అయ్యూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తిరుమలేష్, పోసిరిగారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్, పిన్నంచర్ల, మూలమళ్లలో గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధికార ప్రతినిధి, గీతకార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తూంపల్లికి చెందిన వందమంది బీఆర్‌ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు.



ఆత్మకూర్‌లో పరమేశ్వరస్వామి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

➪ ఆత్మకూర్‌లోని పరమేశ్వరస్వామి చెరువు, ఆలయ పరిసరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎన్నికల అనంతరం ఆలయానికి వెళ్లేందుకు వే‌బ్రిడ్జి నిర్మాణానికి కార్యాచరణ చేపడతామని తెలిపారు. పిన్నంచర్ల శివారులోని మహబూబ్ సుభాని దర్గా ప్రాంగణంలో నిర్మించిన వాటర్‌ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించి దాత శంకర్‌ను అభినందించి సత్కరించారు. అయ్యూబ్‌ఖాన్, బాలకిష్టన్న, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్, పరమేష్, నాగేందర్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, భాస్కర్, ప్రకాష్, వెంకటేష్, ఖాజన్న, హరీశ్‌గౌడ్, అనిత, విజయలక్ష్మి, శ్రీను, గంగ, దస్తగిరి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల సామగ్రి పంపిణీ



ఈవీఎం డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేష్ జైవన్షికి వివరిస్తున్న కలెక్టర్ తేజస్ పవార్

- పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేష్ జైవన్షి

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేష్ జైవన్షి సూచించారు. గురువారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్‌తో కలిసి చిట్యాల శివారులోని డిస్ట్రిబ్యూటర్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి ఇవ్వాల్సిన సామగ్రి, మార్గాల వారీగా వితరణకు అవసరమైన స్థలం, భోజన సౌకర్యం తదితర ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న వసతులు పక్కాగా ఉండాలని ఆదేశించారు. తర్వాత కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను సందర్శించారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాల తనిఖీ, మీడియా ప్రచారాలు రికార్డు చేసేందుకు ఏర్పాటు చేసిన టీవీలు, సి-విజిల్ యాప్, 1950 నుంచి వచ్చే ఫిర్యాదుల వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఏర్పాట్లు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేపట్టిన ఏర్పాట్లను ఆయనకు వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

రెండోవిడత ర్యాండమైజేషన్ పూర్తి..

కలెక్టరేట్‌లో గురువారం సాధారణ పరిశీలకుడు రుచేష్ జైవన్షి ఆధ్వర్యంలో వనపర్తి, గద్వాల జిల్లాలకు సంబంధించిన మైక్రో అబ్జర్వర్ల పరిశీలన కలెక్టర్ తేజస్ పవార్, వనపర్తి, గద్వాల అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, అపూర్వ్ చౌహాన్, ఎం.నగేష్ సమక్షంలో రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

పోలింగ్ రోజున సెలవు

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 13న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రంగా ఉన్న పాఠశాలలు, కార్యాలయాలకు ముందురోజు నుంచే సెలవు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ఓటరు తన ఓటుహక్కును తప్పకుండా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం పోలింగ్ రోజున సెలవు మంజూరు చేసేందుకు కలెక్టర్లకు అధికారం ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి కలెక్టరేట్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటువేసే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫెసిలిటేషన్ సెంటరుకు వచ్చి ఓటు వేసేందుకు ఉద్యోగికి ఒకరోజు ప్రత్యేక సెలవు (స్పెషల్ క్యాజువల్ లీవ్) మంజూరు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రయాణికులు సతమతం

వనపర్తి రోడ్ రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కరువు

- నిరుపయోగంగా మరుగుదొడ్లు.. తాగునీటికీ తిప్పలే
- రెండో ప్లాట్‌ఫాంపై నీడ కరువు
- ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్న వైనం



వనపర్తి రోడ్ రైల్వేస్టేషన్

మదనాపురం: జిల్లాలోనే పెద్ద రైల్వేస్టేషన్ వనపర్తి రోడ్ (మదనాపురం రైల్వేస్టేషన్) సమస్యకు నిలయంగా మారింది. కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ స్టేషన్ నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తుండగా.. ఆత్మకూర్, అమరచింత, మదనాపురం, కొత్తకోట, చిన్నచింతకుంట, అడ్డాకుల తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రయాణికులు ఇటు కాచిగూడకు, అటు కర్నూలుకు రాకపోకలు కొనసాగిస్తారు.

ఫ్లోరైడ్ నీరే దిక్కు..

స్టేషన్‌లో తాగేందుకు మంచినీరు లేదు. కొళాయిల ద్వారా ఫ్లోరైడ్ నీరు సరఫరా అవుతుండటంతో ప్రయాణికులు ఆసక్తి చూపడం లేదు. తప్పని పరిస్థితుల్లో నీటి సీసాలను కొనుగోలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో పందులు సంచరిస్తుంటాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి వేచి ఉండే గదితో పాటు మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరుగుదొడ్లకు తాళాలు..

నాలుగేళ్ల కిందట ప్లాట్‌ఫాం ఒకటి, రెండుపై రూ.15 లక్షలు వెచ్చించి నిర్మించిన నాలుగు మరుగుదొడ్లు అన్ని వసతులతో నిర్మించారు. కానీ వీటికి తాళాలు వేసి ఉండటంతో వృథాగా మారాయి. మరుగుదొడ్డి తాళం చెవి విధుల్లో ఉన్న స్టేషన్ మాస్టర్ వద్ద అందుబాటులో ఉన్నాయంటూ స్టిక్కర్లు అతికించారు. అది కూడా ఆంగ్లంలో రాసి ఉండటంతో నిరక్షరాస్యులకు అర్థం కావడం లేదు. మహిళలు యువకులు స్టేషన్ మాస్టర్ వద్దకు వెళ్లి తాళం చెవి ఇవ్వమని అడగలేకపోతున్నారు. ప్రయాణికుల ఒత్తిడి మేరకు స్టేషన్ ప్రధాన కార్యా లయం పక్కనున్న ఒక మరుగుదొడ్డిని వాడు కునే అవకాశం కల్పించారు. అత్యవసర సమయంలో కొందరు ప్రయాణికులు స్టేషన్ వెలుపల ఉన్న ముళ్ల పొదల్లోకి వెళ్తున్నారు. స్టేషన్ ప్రధాన కార్యాల యం పక్కనే ఉన్న ప్రయాణికులు వేచి ఉండే గదికి కూడా తాళం వేశారు. రెండో ప్లాట్‌ఫాంపై షెడ్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండ, వర్షంలో రైళ్ల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు వాపోతున్నారు.



స్టేషన్‌లో వృథాగా ఉన్న మరుగుదొడ్లు

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం..

మరుగుదొడ్లను వినియోగం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు వేచి ఉండే గదిని అందుబాటులోకి తీసుకొస్తాం. మిగిలిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

– విష్ణు, స్టేషన్ మాస్టర్, వనపర్తి రోడ్

వినియోగంలోకి తీసుకురావాలి..



మరుగుదొడ్లకు వేసిన తాళాలు తొలగించి వినియోగంలోకి తీసుకురావాలి. ఆడవారు స్టేషన్ మాస్టర్‌ను తాళపు చెవి అడగలేక ఇబ్బ ందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులోకి తీసుకురావాలి.

– రాజు, అమరచింత

ఎప్పుడు వచ్చినా ఇదే పరిస్థితి..



రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్లు, తాగునీటి సమస్య దారుణంగా ఉంది. ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నాం. అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

– యుగంధర్ యాదవ్, కొత్తకోట

అధికారులు పట్టించుకోవాలి..



జిల్లాలో పెద్ద రైల్వేస్టేషన్ ఇది. కనీసం తాగడానికి మంచినీరు కూడా లేదు. సంబంధిత అధికారులు స్పందించి స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

– సూరిబాబు, మదనాపురం

బీర్లు.. నో స్టాక్

15 రోజుల నుంచి తీవ్రమైన కొరత

- ఒక్క ఏప్రిల్‌లోనే ఉమ్మడి జిల్లాలో 4,02,961 కాటన్ల విక్రయం
- ఈ నెలాఖరు వరకు ఇదే పరిస్థితి అంటున్న ఎక్సైజ్ అధికారులు



మహబూబ్‌నగర్ క్రైం: మండే ఎండల నుంచి ఉపశమనం కోసం మందుబాబులు చల్లని బీర్లపై ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో చల్లదనం ఉన్న బీర్లు మార్కెట్లో కొరత ఏర్పడటంతో భారీగా డిమాండ్ పెరిగింది. ఒక్క ఏప్రిల్ నెలలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4,02,961 కాటన్ల బీర్ల విక్రయాలు జరిగాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని తిమ్మాజిపేట, కొత్తకోట మద్యం డిపోలకు బీర్లు సరఫరా చేస్తున్నారు. అయితే ఎండలు విపరీతంగా పెరగడంతో పాటు ఇటీవల ప్రొడక్షన్ సక్రమంగా లేకపోవడం ఇందుకు కారణమైంది. ఇప్పటికే జిల్లాలో చాలావరకు బీర్ల కొరత ఉండగా.. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే బీర్లకు డిమాండ్ ఉంటుంది. కానీ, ఇప్పుడే కొరత తలెత్తడంతో ఇటు మందుబాబులు, అటు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు.

ఉత్పత్తి తక్కువ కావడం వల్లే..


గతంలో ప్రతి ఏడాది వేసవి కోసం డిసెంబర్, జనవరి నెలల్లో ఓవర్ టైం పనిచేసి బీర్లు అధికంగా ఉత్పత్తి చేసి స్టాక్ చేసేవాళ్లు. ఈసారి అలా చేయకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా కొరత ఏర్పడింది. ఈ నెల చివరి నాటి వరకు జిల్లాలో బీర్ల కొరత ఉంటుంది. ప్రొడక్షన్ తక్కువ కావడం వల్ల ఈ సమస్య వచ్చింది.

– విజయ్‌భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, మహబూబ్‌నగర్

నో స్టాక్ బోర్డులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 230 మద్యం దుకాణాల్లో అన్నిచోట్ల నో-స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. 15 రోజులుగా ఉమ్మడి జిల్లాలో స్టాక్ వచ్చిన పది నిమిషాల్లో ఖాళీ అవుతున్నాయి. తిమ్మాజిపేట, కొత్తకోట డిపోల నుంచి ఒక్కో దుకాణానికి 2-5 కేసుల వరకు మాత్రమే బీర్లు ఇస్తున్నారు. ఇచ్చిన స్టాక్ నిమిషాల వ్యవధిలో అయిపోవడంతో కష్టమర్లు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు డిమాండ్‌కు తగ్గట్టుగా బీర్లు లేకపోవడంతో వ్యాపారులు సైతం నష్టపోతున్నారు. విపరీతంగా పెరిగిన ఎండలకు తోడు ఇటీవల లారీల సమ్మె జరగడంతో బీర్ల సరఫరా, ఉత్పత్తిలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇప్పటి అక్కడక్కడ కొంత వరకు బీర్ల కొరత ఉండగా.. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని, సాధ్యమైనంత వరకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు.

ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీర్ల విక్రయాలు ఇలా.. (కాటన్లలో..)



కాంగ్రెస్‌కు ఓటేసి రుణం తీర్చుకుందాం

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


ఉప్పునుంతల మండలం ఈరట్వానిపల్లిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

వనపర్తి/ఉప్పునుంతల: నాలుగు కోట్ల మంది ఆకాంక్ష, వందలాది మంది ప్రాణత్యాగాలు చేసి 60 ఏళ్ల పాటు ఎదురు చూసిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతతో కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం వనపర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మేఘారెడ్డితో, ఉప్పునుంతల మండలంలోని ఈరట్వానిపల్లి, వెల్టూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డా. వంశీకృష్ణతో కలిసి పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే అమలు చేసిందని తెలిపారు. పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డికి సీఎం అవకాశం వచ్చిందని.. ఉమ్మడి పాలమూరు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎంపీ రాములు ఐదేళ్ల కాలంలో ఏనాడు పార్లమెంట్‌లో నోరు విప్పలేదని, ఇప్పుడు ఆయన కుమారుడికి బీజేపీ టికెట్ ఇప్పించి ఓట్లు వేయాలని అడుగుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నిన్న మొన్నటి వరకు బీఎస్పీలో ఉండి కేసీఆర్‌ది నియంత పాలన, కుటుంబ పాలన అని తిట్టి ఇప్పుడు ఆయన చెంత చేరారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. రైతులకు పంట రుణమాఫీ కావాలన్నా, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కావాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. గిరిజన సమ్మేళనానికి చివరి క్షణంలో హాజరైన సినీ తార దివ్యవాణి ప్రసంగం ఆకర్షణీయంగా మారింది. ఆమె గిరిజన మహిళలతో సంప్రదాయ ఆటపాటల్లో పాల్గొన్నారు. వనపర్తిలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రఘుప్రసాద్, రవికుమార్, శంకరప్రసాద్, బాషానాయక్, బ్రహ్మం, సుమిత్ర, యాదగిరి, రమాదేవి, కృష్ణ, ఉప్పునుంతల మండలంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు డా. మోపతయ్య, శివకుమార్, కట్టా అనంతరెడ్డి, తిప్పర్తి నర్సింహారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలకు మోదీ ఎంతో అవసరం


ఊట్కూరు రోడ్‌షోలో డోలు వాయిస్తున్న డీకే అరుణ

మక్తల్/ ఊట్కూరు/ నర్వ/ అమరచింత/ ఆత్మకూర్: దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవసరం ఎంతో ఉందని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. గురువారం ఆమె మక్తల్, ఊట్కూరు, నర్వ, అమరచింత, ఆత్మకూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని మూడోసారి ప్రధాని చేసేందుకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని చెప్పారు. తనకు లభిస్తున్న ప్రజా ఆదరణను జీర్ణించుకోలేక ఆడపిల్ల అని చూడకుండా కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు తెరలేపిందని విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అభివృద్ధి గురించి మాట్లాడాలని.. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఏం వస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికే గ్యారంటీ లేదని.. అలాంటి ఆరు గ్యారంటీ పథకాలు ఏం అమలు చేస్తారని ఎద్దేవా చేశారు. కరోనా కష్టకాలంలో ఉచిత టీకాలు అందించి దేశ ప్రజలను ఆదుకున్నారని, విశ్వకర్మ పథకంలో 18 రకాల కులవృత్తుల వారికి రుణాలు అందిస్తుందని, దేశవ్యాప్తంగా పేదలకు 5 కిలోల ఉచితం బియ్యం అందిస్తున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను ఎత్తివేస్తుందని కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారం చేయడం ఆపాలని హితవు పలికారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలతోపాటు దేశవ్యాప్తంగా 400 ఎంపీ సీట్లు బీజేపీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. మా నాయన, దివంగత నేత చిట్టెం నర్సిరెడ్డి చెప్పిన ప్రకారమే నడుస్తున్నానని, ప్రజలకు తమపై నమ్మకం ఉందన్నారు. వలస నాయకులను గురిపెట్టి ఓడించాలని కోరారు. ఆడబిడ్డ అనే గౌరవం లేకుండా మాట్లాడుతున్నారని, ఎంతమంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా తన గెలుపును ఆపలేరన్నారు. తాను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన 200 మందికిపైగా కార్యకర్తలు, నాయకులు ఆమె సమక్షంలో బీజేపీలో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, దళిత మోర్చ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు హన్మంతు, విజయన్‌గౌడ్, మేర్వ రాజు, శంకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, అశ్విన్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు బీఆర్‌ఎస్ హయాంలో ప్రాధాన్యత


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో హజ్ హౌస్ నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అత్యాధునిక వసతులతో గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాల కోసం రూ.125 కోట్లు, ఇమాం, మౌజంలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చినట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పండుగలకు, పేద ప్రజలకు ఇచ్చే కానుకలు నిలిచిపోయాయని అన్నారు. పదేళ్లలో మహబూబ్‌నగర్‌ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని, నామినేటెడ్ పదవుల్లో కూడా ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం గురించి బీఆర్‌ఎస్ పార్టీ ఒక్కటే ఆలోచన చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ పక్షాన పోరాటం చేసి నిధులు సాధిస్తానన్నారు. సమావేశంలో మైనారిటీ నాయకులు రెహమాన్, మోసిన్, అహ్మద్, ఇమ్రాన్, మోసిన్ ఖాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యం

- కేంద్ర సహాయమంత్రి మురుగన్

వంగూరు: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం అవసరమని కేంద్ర సమాచార, పశుసంవర్ధక శాఖ సహాయమంత్రి మురుగన్ అన్నారు. గురువారం వంగూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి మంత్రి మురుగన్‌తో పాటు పార్లమెంటు సభ్యులు రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి కేంద్ర మంత్రి మురుగన్ మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా కీర్తించేలా చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని ఆ పార్టీ నాయకురాలు కవిత మద్యం కేసులో జైలుకు వెళ్లిందన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు సంతోషంగా లేరన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బియ్యం పథకంతో పాటు వివిధ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భరత్‌ప్రసాద్‌ను కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ రాములు మాట్లాడుతూ.. ఐదేళ్ల తన పదవీ కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాస్కర్, రామకృష్ణారెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి మురుగన్

కేంద్ర ప్రభుత్వం రైతులకు చేసిందేమి లేదు



మాట్లాడుతున్న శ్రీహరిరావు

స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్ల బీజేపీ పాలనలో రైతులకు చేసిందేమి లేదని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం వరికి రూ.5076లు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరితే కేంద్రం ప్రభుత్వం రూ.2183 నిర్ణయించడం దారుణమన్నారు. మొక్కజొన్నకు రూ.3123 ఇవ్వాలని ప్రతిపాదనలు పంపితే రూ.2090లు, కందులకు రూ.11,166లకు కేవలం రూ.7వేల మద్దతు ధర నిర్ణయించిందన్నారు. స్వామినాథన్ సిఫార్సులను అమలుచేస్తామని కాంగ్రెస్ మేనిఫేస్టోలో పెట్టిందన్నారు. రైతులు ఏకమై పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు గంగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం

గద్వాల అర్బన్/కేటీదొడ్డి/మల్దకల్: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం, అభ్యున్నతి సాధ్యమవుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ధరూరు మండలం నెట్టెంపాడ్, మల్దకల్ మండలంలోని మద్దెలబండ, గట్టు మండలంలోని మాచర్లకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మల్లురవి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, సినీ నటి దివ్యవాణి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, కుర్వ శ్రీనివాసులు, జగదీష్, వెంకట్రాములు, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

మ్యానిఫెస్టో కరపత్రాలు విడుదల

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తిరుపతయ్య భారతీయ యువజన కాంగ్రెస్ మ్యానిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థిని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ గౌడ్, రాజేంద్ర, బీఆర్ తిమ్మన్న, ఇలియాస్, సత్యం తదితరులు ఉన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఆశీర్వదిస్తే అందరికీ అందుబాటులో ఉంటానని ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. గురువారం రాత్రి కేటీదొడ్డి మండలంలోని సుల్తాన్‌పురం, ఎర్సందొడ్డి, చింతలకుంట, నందిన్నెలో జెడ్పీచైర్‌పర్సన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని రంగాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ హామీలను నమ్మవద్దన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

ప్రతి ఇంటికి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి అన్నారు. మల్దకల్ మండలంలోని బిజ్వారం, అమరవాయి, ఎల్కూరు, పాల్వాయి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి మల్లురవి

భార్య గొంతుకోసి హత్యచేసిన భర్త


జ్యోతి(ఫైల్)


నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం మత్తులో భార్య గొంతుకోసి హత్య చేసి భర్త పరారీలో ఉన్న సంఘటన మండల పరిధిలోని వనపట్లలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వనపట్లకి చెందిన జ్యోతి(35)ని శ్రీపురానికి చెందిన రాములుకి ఇచ్చి పదిహేనేళ్ల కిందట వివాహం జరిపించారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకోవడంతో జ్యోతి తన ఇద్దరు కుమారులతో సహా వనపట్లలోని తన తల్లి ఇంట్లోనే ఉంటుంది. భర్త రాములు కూలి పనులు చేసుకుంటూ భార్య వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. గురువారం ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాములు తన భార్యని కత్తిపీటతో గొంతు కోశాడు. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని సీఐ కనకయ్య గౌడ్, ఎస్‌ఐ గోవర్ధన్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతురాలి అక్క అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

జడ్చర్ల: పట్టణ శివారులోని నల్లచెరువులో పడి కావేరమ్మపేటకు చెందిన నాగమ్మ(75) మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. నాగమ్మకు కల్లుతాగే అలవాటు ఉండటంతో బుధవారం కల్లు మత్తులో పిచ్చిగా ప్రవర్తించి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. గురువారం చెరువులో మృతదేహం కనిపించగా కుటుంబసభ్యులు గుర్తించారు. కుమారుడు పెద్ద ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వెంటాడుతున్న చిరుత భయం

- మద్దూరులోని పలు గ్రామాల్లో లేగదుడలు, మేకలు బలి
- స్పందించని ఫారెస్ట్ అధికారులు


మోమినాపూర్ గుట్టలో లేగదూడను పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఫైల్)

మద్దూరు: ఉమ్మడి మండలంలోని చిరుత పులుల సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. కొంతకాలంగా మండలంలోని మోమినాపూర్, చెన్నారెడ్డిపల్లి, పెదిరిపాడ్, పెదిరిపాడ్ తండాల పరిధిలో గుర్రంగుట్టపై పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటి మోమినాపూర్ చెందిన బొయిని చిన్న నర్సింహులు చెందిన లేగదూడను చంపినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ గ్రామాలకు గుట్టకు దగ్గర ఉండడంతో గుట్ట కిందనే పొలాలు ఉండడంతో రైతులు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇటీవల పెదిరిపాడ్‌తండాలో రెండు మేకలను, చెన్నారెడ్డిపల్లిలో మేకను చిరుతపులి చంపేసింది. ఈ గ్రామాల ప్రజలకు గుట్టపై పులి ఉందని అటవీ శాఖ అధికారులకు తెలియజేసినా బోను ఏర్పాటు చేయడం లేదని వాపోయారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి మండలంలోని నందిగామ, గోకుల్‌నగర్, దుప్పట్‌గట్ గుట్టల్లో చిరుత పులులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దుప్పట్‌గట్ చెందిన కుర్మయ్య లేగదూడ మూడు రోజుల క్రితం చిరుత పులి చంపివేసినట్లు తెలిపారు. అలాగే ఇటీవల నందిగామ, గోకుల్‌నగర్ చెందిన రైతుల లేగదుడలు, మేకలను చంపివేస్తున్నట్లు తెలిపారు. గత నెల 18న రాత్రి ఆటోలో వెళ్తున్న ప్రయాణికులకు రోడ్డుపైనే చిరుతపులి అడ్డం వచ్చినట్లు చెప్పారు. రాత్రి అయితే గ్రామస్తులందరూ పొలాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. గత నెల 28న చిరుత పులి దాడిలో దుప్పట్‌గట్‌కు చెందిన కావాలి అంజిలయ్య లేగదూడ మృతి చెందింది. ఈ నెల 1న తిమ్మారెడ్డిపల్లికి చెందిన చిన్న మొగులప్పకు చెందిన లేగదూడను చంపి వేసిన ఘటన చోటు చేసుకుంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

మోమినాపూర్, నందిగామ గుట్టల్లో చిరుత పులుల సంచారం ఉన్న మాట వాస్తవం. గుట్టల్లో చిరుత పులి పట్టుకోవడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఇప్పటి వరకు బోను ఏర్పాటుకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. మంగళవారం రాత్రి సోషల్ మీడియాలో వచ్చిన ఫొటో పెద్దపులిది. అవి ఈ ప్రాంతంలో ఉండవు. ఇక్కడ ఉన్నవి చిరుతపులులు మాత్రమే.

– లక్ష్మణ్‌నాయక్, ఫారెస్ట్ బీట్ అధికారి

సీఎం నియోజకవర్గంలో అధికారులు చిన్నచూపు

శంషాబాద్ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుందని సీసీ కెమెరాల్లో కనిపించడంతో అటవీశాఖ అధికారులు 5బోన్లు ఏర్పాటు చేసి పట్టుకోవడానికి నానాయాతలు పడుతున్నారు. 2నెలలుగా సీఎం సొంత నియోజకవర్గంలో చిరుత సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించిన, ప్రజాప్రతినిధులు బోను ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా లాభం లేకుండా పోయింది. లేగదూడ స్థానంలో మనిషి చనిపోయిన స్పందించని పరిస్థితి కొడంగల్ ప్రాంతంలో ఉంది.

సిర్సనగండ్ల ఆలయ హుండీ లెక్కింపు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 16 నుంచి 22 వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన హుండీలను ఆలయ చైర్మన్ రామశర్మ, ఎండోమెంట్ అధికారిని వీణాధరి, ఈఓ ఆంజనేయులు, మేనేజర్ నిరంజన్, అధికారుల సమక్షంలో లెక్కించారు. మొత్తం రూ.8,26,978లు భక్తులు కానుకలు వేసినట్లు ఆలయ చైర్మన్, ఈఓ పేర్కొన్నారు. 300 గ్రాముల వెండి సమర్పించినట్లు తెలిపారు. గతేడాది కంటే రూ.4.20 లక్షలు ఆదాయం తక్కువగా వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



నాణ్యతగా ప్రసాద్ స్కీం పనులు

- తెలంగాణ టూరిజంశాఖ ఎండీ రమేష్‌నాయుడు


టూరిజం ఎండీ రమేష్‌నాయుడుతో మాట్లాడుతున్న ఈవో పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: ప్రసాద్ స్కీం పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని తెలంగాణ పర్యాటకశాఖ ఎండి కె.రమేష్‌నాయుడు కోరారు. గురువారం ఆయన తొలిసారిగా అలంపూర్ ఆలయాలను సందర్శించి పర్యాటకశాఖ నిధులు రూ.36 కోట్లతో చేపడుతున్న ప్రసాద్ స్కీం పనులను పరిశీలించారు. అంతకుముందు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రాగా ఈఓ పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన పర్యాటకశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నదీతీరంలో నిర్మించిన ప్రసాద్ స్కీం భవనాన్ని పరిశీలించారు.

సౌండ్ అండ్ లైటింగ్ షో ఏర్పాటుకు స్థల పరిశీలన..

క్షేత్ర వైభవాన్ని చాటి చెప్పేలా సౌండ్ అండ్ లైటింగ్ షో ఏర్పాటుకు ఆలయ సమీపంలోని పురావస్తు ప్రదర్శనశాలను అనువైన స్థలంగా గతంలో గుర్తించారు. గురువారం టూరిజం ఎండి కె.రమేష్‌నాయుడు సందర్శించి భవనం నిర్మించి ఎంతకాలం అయింది.. పర్యాటకులు పైకి ఎక్కి లైటింగ్ షో తిలకించేందుకు అనువైన స్థలమేనా అనే అనుమానం వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రహరీ నిర్మాణం, భక్తులు దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణాల గురించి అధికారులను ప్రశ్నించగా వీటికి సంబంధించిన డ్రాయింగ్స్ బుధవారమే వచ్చాయని బదులిచ్చారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని.. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భోజనశాలలను దేవస్థానానికి అప్పజెప్పాలని.. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట మల్టీమీడియా సౌండ్ అండ్ లైట్ షో టెక్నికల్ విభాగం సిబ్బంది చెన్నైకు చెందిన వివపిళ్లై, ప్రాజెక్టు జీఎం ఉపేందర్, సీఈ వెంకటరమణ, డీఈ ధన్‌రాజ్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్, కన్సల్టెంట్ సూర్యనారాయణమూర్తి, జయవర్ధన్, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కొలువుకు బై.. ప్రజాసేవకు జై!

నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు విజయం సాధించి, ఐదోసారి ఓటమి చవిచూసిన మందా జగన్నాథం.. ప్రభుత్వ వైద్యుడిగా 14 ఏళ్లపాటు పనిచేశారు. ఆయన



గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఎంఎస్, డీఎల్‌ఓ సర్జన్‌గా విద్యనభ్యసించారు.- 1982 నుంచి 84 వరకు నల్లగొండ జిల్లా సూర్యాపేట సివిల్ ఆస్పత్రిలో అసిస్టెంట్ సర్జన్‌గా మందా జగన్నాథం పనిచేశారు. ఏపీ స్పెషల్ పోలీస్ 8వ బెటాలియన్ యూనిట్ మెడికల్ ఆఫీసర్‌గా 1984 నుంచి 87 వరకు, సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1987 – 92 వరకు, అదే ఆస్పత్రిలో జనరల్ సర్జరీలో బోధకుడిగా ఏడాదిపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం న్యూరో సర్జన్ విభాగంలో 1993 – 96 వరకు బోధకుడిగా పనిచేశారు. 1996లో టీడీపీ ద్వారా రాజకీయ రంగప్రవేశం చేసి.. ఎంపీగా నాలుగుసార్లు విజయం సాధించారు.

మార్కెట్ కార్యదర్శి నుంచి..



నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయ రంగప్రవేశం చేశారు. మెదక్ జిల్లా సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. 1994లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి, టీడీపీలో చేరారు. అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసి, విజయం సాధించారు. ఆ తర్వాత వచ్చిన 1999, 2009 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో మంత్రిగా పనిచేశారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి దుర్మరణం

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి శివారులో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం పట్టణంలోని ఎల్లికల చౌరస్తా నుంచి వంగూరు మండలం రంగాపూర్‌కు ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని ఆటో బయలుదేరింది. పట్టణ శివారులోని కైలాసం గుట్ట సమీపంలో మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అదే గ్రామానికి చెందిన బాలస్వామి(50)కి తీవ్రగాయాలు కాగా.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై బాలస్వామి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫ్యాషన్



వేసవి వేడిమిని తట్టుకోవాలి,
కంఫర్ట్‌గా ఉండాలి
అదే టైమ్‌లో స్టైలిష్‌గానూ కనిపించాలి.
కాటన్ కుర్తీ పైకి బాందినీ,
చందేరీ, ఇకత్, సిల్క్ ఓవర్ కోట్లు
ఇప్పుడు బెస్ట్ ఛాయిస్‌గా ఉంటున్నాయి.
బోహోస్టైల్‌ని తలపిస్తూ, సమ్మర్ స్పెషల్‌గా ఉండే
ఈ స్టైల్ ఏ సందర్భానికైనా బాగా నప్పుతుంది.

కలర్‌ఫుల్‌గా.. కంఫర్టబుల్‌గా..



లాంగ్ ఫ్రాక్ లేదా లాంగ్ కుర్తీ ఈ స్టైల్‌కి ఎంచుకోవచ్చు. సాక ర్యాన్ని బట్టి స్లీవ్స్ లేదా స్లీవ్‌లెస్ టాప్స్‌ని సెలక్ట్ చేసుకోవాలి. కాటన్ కుర్తీ ఏ ఫ్యాబ్రిక్ అయినా ఫ్లోరల్స్‌లో లేదా భిన్నమైన ప్రింట్లు ఉన్న ఓవర్ కోట్స్ బాగా నప్పుతాయి. ఈ స్టైల్ డ్రెస్సింగ్ బోహో లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది. ఈ కాలానికి తగినట్టుగా ఫ్యాషన్ జ్యువెలరీ దీనికి సరైన ఎంపిక అవుతుంది.

సంప్రదాయ వేడుకల్లో షిమ్మరీ లుక్ ఉండే లాంగ్ ఫ్రాక్స్, వాటి మీదకు సిల్క్ డిజైనర్ లాంగ్ ఓవర్ కోట్స్ ప్రత్యేకతను చూపుతాయి.



ప్లెయిన్ డ్రెస్ ధరించినప్పుడు పూర్తి కాంట్రాస్ట్ ఓవర్ కోట్ వేసుకుంటే ఎక్కడ ఉన్నా స్పెషల్‌గా కనిపిస్తారు.



లాంగ్ ఫ్రాక్‌కి అటాచ్ చేసినట్టుగా ఉండే ఫ్రాక్ స్టైల్ ఓవర్ కోట్ పార్టీల్లో స్టైలిష్ లుక్‌తో వెలిగిపోతుంది.

కాటన్ కుర్తీ–పైజామా మీదకు ఫ్లోరల్ ప్రింట్ ఉన్న కాటన్ ఓవర్‌కోట్‌ను ధరించ వచ్చు. దుపట్టా అవసరం లేని ఈ స్టైల్ క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ సెట్ అవుతుంది.



కాటన్ లాంగ్ కుర్తీకి ఇక్కత్ లాంగ్ ఓవర్ కోట్ ధరిస్తే ఉక్కబోతను, స్టైల్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేయవచ్చు.



సింపుల్ అండ్ గ్రేస్‌గా కనిపించే లుక్ టాప్ అండ్ బాటమ్‌కి ఫ్లోరల్ ఓవర్ లాంగ్ కోట్ సూపర్ స్టైలిష్ లుక్‌గా కనిపిస్తుంది.



సిల్క్ టాప్స్ అయినా ఈవెనింగ్ టైమ్‌కి ఓకే అనుకున్నవారు అదే కాంబినేషన్‌లో వచ్చే సిల్క్ ఓవర్ కోట్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.



ఓవర్‌కోట్‌లా అనిపించే లాంగ్ ఫ్రాక్ డ్రెస్‌ను కూడా ఈ స్టైల్‌కి ఎంపిక చేసుకోవచ్చు. సమ్మర్‌లో ఈవెనింగ్ పార్టీకి స్పెషల్ అట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు.

ఎక్స్‌పర్ట్

ఇప్పుడు డీప్‌ఫేక్‌ల వివాదం నడుస్తోంది.
ఎన్నికల సమయంలోనే కాదు
సర్వ కాలాల్లోనూ డీప్‌ఫేక్ వీడియోలు
ప్రముఖులకు పెద్ద సవాలు.
ఇక స్త్రీలకు ఇవి పీడగా పరిణమించాయి.
వీటి గుట్టుమట్లు ఏమిటో
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నీడలో
ఎలా జాగ్రత్తగా జీవించాలో తెలియచేస్తోంది
ఆ రంగంలో నిపుణురాలు మధుమిత ముర్గియా.

డీప్‌ఫేక్ గుట్టు ఆమెకు తెలుసు



మధుమితా ముర్గియా

‘ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో తయారయ్యే డీప్‌ఫేక్ వీడియోలు ఎంత కచ్చితంగా ఉంటాయంటే నిజమైనవా, అబద్ధమైనవా కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు. డీప్‌ఫేక్ వీడియోలు ఎవరినీ వదలవు. ప్రముఖులు వీటివల్ల అభాసుపాలు కావచ్చు. కాని మామూలు స్త్రీలు దీని బాధితులవుతారు. డీప్‌ఫేక్‌లో వీడియోను మార్ఫింగ్ చేయొచ్చు. అంటే మీరు పార్క్‌లో నడుస్తుంటే బీచ్‌లో నడుస్తున్నట్టుగా మార్చవచ్చు. దుస్తులతో ఉంటే దుస్తులు లేకుండా చేయొచ్చు. మరో పద్ధతి ‘ఇమేజ్ క్రియేటింగ్’. అంటే మీ వీడియో ఏమీ లేకపోయినా మీ ఇమేజ్‌ను పూర్తిగా సృష్టించి దానిని కావల్సినట్టుగా ఆడించవచ్చు. డీప్‌ఫేక్‌లో ఏ స్త్రీనైనా పోర్నోగ్రఫీ వీడియోలో ఉన్నట్టుగా భ్రమింపచేయవచ్చు. అదొక్కటే కాదు నిషేధిత సమయాల్లో నిషేధిత ప్రదేశాల్లో సంఘవ్యతిరేక శక్తుల మధ్య ఉన్నట్టుగా కూడా మిమ్మల్ని చూపొచ్చు. దీనికి అంతం లేదు. రాజకీయ ఉపన్యాసాలను డీప్‌ఫేక్‌తో మార్చి ఇబ్బంది పెట్టడం చాలా సులువు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రయోజనాలు ఎన్ని ఉన్నాయో ప్రమాదాలు అన్ని ఉన్నాయి. ఈ టెక్నాలజీ నాశనం అయ్యేది కాదు. మరింత పెరిగేది. దీని పట్ల ఎరుకతో ఉండటమే చేయగలిగింది’ అంటుంది మధుమితా ముర్గియా. ఆమె ఏ.ఐ. ఎక్స్‌పర్ట్.

బ్రిటిష్ ఇండియన్

ముంబైలో మూలాలు కలిగిన మధుమితా ముర్గియా లండన్‌లో పెరిగింది. అక్కడే చదువుకుంది. బయోలజిస్ట్‌గా, ఇమ్యూనాలజిస్ట్‌గా పని చేస్తూ టెక్ ఇండస్ట్రీ గురించి ఆసక్తి పెంచుకుంది. లండన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికకు ఏ.ఐ. ఎడిటర్‌గా పని చేస్తూ వ్యాపార ప్రయోజనాల కోసం మన డేటా ఎలా వాడబడుతున్నదో, చేతిలోని ఫోన్ వల్ల మన ప్రైవసీకి ఎలా భంగం కలుగుతున్నదో ఆమె ప్రపంచానికి తెలియచేస్తూ వస్తోంది. అంతేకాదు ఈ విషయాల గురించి ఆమె రాసిన తాజా పుస్తకం ‘కోడ్ డిపెండెంట్’కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. 2024 సంవత్సరానికి ఆమె బెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నలిస్ట్‌గా బ్రిటిష్ ప్రెస్ అవార్డ్‌ను గెలుచుకుంది.

ఏ.ఐ.తో మంచి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మూడు రంగాల్లో మంచి జరుగుతున్నదని అంటుంది మధుమిత. ‘ఆరోగ్య రంగంలో రిపోర్ట్‌ల ఆధారంగా పేషెంట్ వ్యాధిని ఏ.ఐ.తో గొప్ప స్పెషలిస్ట్ స్థాయిలో అంచనా కట్టొచ్చు. దీనివల్ల డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం వేచి ఉండే బాధ తప్పింది. ఫార్మాసూటికల్ రంగంలో కూడా ఏ.ఐ సేవలు బాగా ఉపయోగపడతాయి. ఇక సైన్స్ రంగంలో చేయాల్సిన పరిశోధనలు సులువవుతాయి. విద్యారంగంలో విద్యార్థుల రీసెర్చ్ కోసం ఏ.ఐ. ఉపయోగపడుతుంది. నేర పరిశోధనలో ఏ.ఐ.ని వాడి నేరస్తులను పట్టుకుంటున్నారు. ఇవన్నీ మంచి విషయాలే’ అంటుందామె.

చెడు ఎంతో ఉంది:

‘ఏ.ఐ. వల్ల రాబోయే ఐదేళ్లలో ఫొటోగ్రాఫర్లు అనేవాళ్లే లేకుండా పోవచ్చు. ఏ.ఐ. సహాయంతో ఎవరైనా సరే గొప్ప ఫొటోలు తీయవచ్చు. రచయితల బదులు ఏ.ఐ.తో కథలు రాయవచ్చు. కంప్యూటర్ల మీద జరగాల్సిన చాలా పనులు మనుషులు లేకుండానే జరిగే స్థితి రావచ్చు. దీనివల్ల లాభాలు సంస్థలకు వచ్చిన మనుషుల ఉనికి అంటే ఉద్యోగుల ఉనికి ఆందోళనలో పడుతుంది. చేతిలో ఫోన్ ఉంటే ఏ.ఐ. ద్వారా మీ ప్రతి కదలికను గుర్తించవచ్చు. మీరు ఇంట్లో ఉన్నా సురక్షితం కాదు. మీరు యాప్స్ ద్వారా కొనే వస్తువులను, మీరు వెళ్లే ఆస్పత్రులను, మీరు కొనే మందులను, వెళ్లే రెస్టరెంట్లను బట్టి రాబోయే కాలంలో మీ జీవితం ఎలా ఉంటుందో ఊహించి మీ చేత ఏమేమి కొనిపించాలో మిమ్మల్ని ఎలా వినియోగదారునిగా మార్చాలో ఏ.ఐ. ఆయా కంపెనీలకు చెబుతుంది. గతంలో ఒక టెక్నాలజీని అనేక ఏళ్లు పరీక్షించి జనానికి మేలు కలిగే విధంగా వదిలేవారు. ఏ.ఐ. లాంటివి మంచి చెడ్డలు పరీక్షించకనే వదిలారు. అవి రోజు రోజుకూ శక్తి పుంజుకుంటున్నాయి. ఏ.ఐ. నుంచి తప్పించుకోలేము. అలాగని మరీ అంత భయం కూడా అక్కర్లేదు. మానవశక్తి, మానవ జ్ఞానం కృత్రిమ యాంత్రిక జ్ఞానం కంటే ఎప్పుడూ గొప్పవే’ అంటోంది మధుమిత.

వంటిల్లు

చల్ల కూరలు

మే నెల వచ్చేసింది... ఎండలు మండుతున్నాయి.
భోజనం చేయాలంటే చెమటలు పడుతున్నాయి.
కూరలను చూస్తేనే ఆకలి పోయి దాహం వేస్తోంది.
నేరుగా మజ్జిగలోకి వెళ్లాలనిపించేంత దాహం అది.
అందుకే పెరుగుతోనే కూరలు చేసుకుందాం.
ఇవన్నీ నాలుకకు హితవుగా ఉంటాయి.
తిన్న తర్వాత పొట్టను చల్లగా ఉంచుతాయి.

దహీ బైంగాన్



కావలసినవి: వంకాయ – 1 (మీడియం సైజు); నూనె – టేబుల్ స్పూన్ (వంటకు ఉపయోగించే నూనె ఏదైనా) ; ఆవనూనె – టేబుల్ స్పూన్ (పోపు కోసం) ; యాలకులు – 2 ; లవంగాలు – 2 ; పెరుగు – పావు లీటరు (చిలకాలి).

గ్రేవీ కోసం: మెంతిపిండి – టేబుల్ స్పూన్ ;అల్లం పేస్ట్ – టేబుల్ స్పూన్ ; కశ్మీర్ మిర్చిపొడర్ – టేబుల్ స్పూన్ ; నీరు – కప్పు (పై వన్నీ కలపడానికి) ; ఇంగువ– చిటికెడు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు – టీ స్పూన్.

తయారీ: ● ఒక పాత్రలో కప్పు నీరు పోసి అందులో మెంతిపిండి, మిర్చిపొడర్, అల్లం పేస్టు వేసి కలపాలి ● వంకాయను మందపాటి చక్రాల్లా తరిగి ఉప్పు రాయాలి ● నూనె వేడి చేసి వంకాయ ముక్కలను వేయించి పక్కన పెట్టాలి(ఎయిర్ ఫ్రయర్ ఉంటే నూనె లేకుండా ఫ్రై చేసుకోవచ్చు) ● అదే బాణలిలో మిగిలిన నూనెలో ఆవ నూనె వేసి వేడెక్కిన తర్వాత లవంగాలు, యాలకులు, ఇంగువ వేయాలి. ఇందులో మెంతిపిండి, అల్లం, మిరప్పొడి కలిపిన మిశ్రమం, పసుపు వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి ● ఆ మిశ్రమం వేడెక్కిన తర్వాత పెరుగు వేసి గరిటెతో కలుపుతూ ఐదారు నిమిషాల పాటు మరిగించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మరో కప్పు నీటిని పోసి కలిపితే చిక్కటి గ్రేవీ తయారవుతుంది. ఇప్పుడు ఉప్పు కలిపి గ్రేవీ చిక్కదనాన్ని సరిచూసుకుని అవసరమైతే మరికొన్ని నీటిని పోసి మరగనివ్వాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వంకాయ ముక్కలను వేసి కలిపి వడ్డించాలి. ఇది అన్నంలోకి రోటీకి కూడా మంచి కాంబినేషన్.

పులిస్సెరి



కావలసినవి: పెరుగు – పావు లీటరు ; పసుపు – పావు టీ స్పూన్ ; నీరు – పావు లీటరు.

కొబ్బరి పేస్టు కోసం: పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు ; పచ్చిమిర్చి– 3 ; జీలకర్ర– టీ స్పూన్; నీరు – కప్పు లేదా కొబ్బరి పేస్టు చేయడానికి తగినంత.

పోపు కోసం: నూనె – 2 టేబుల్ స్పూన్‌లు (వంటకు ఉపయోగించే కొబ్బరి నూనె లేదా ఇతర వంట నూనె) ; ఆవాలు – అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; మెంతులు– పావు టీ స్పూన్ ; ఎండుమిర్చి– 2 ; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు ; అల్లం – అర అంగుళం ముక్క (సన్నగా తరగాలి) ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర మిక్సీలో గ్రైండ్ చేయాలి. తగినంత నీటిని వేస్తూ మెత్తగా చేసుకోవాలి ● ఒక పాత్రలో పెరుగు, పసుపు, నీరు కలిపి చిలికి అందులో ఉప్పు, కొబ్బరి పేస్టు వేసి కలపాలి ● ఈ పాత్రను స్టవ్ మీద పెట్టి మీడియం మంటమీద మధ్యలో గరిటెతో కలుపుతూ వేడిచేయాలి. దీనిని ఎక్కువసేపు ఉడికించాల్సిన అవసరం లేదు. మరగడం మొదలైన వెంటనే దించేయాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం తరుగు వేసి చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తర్వాత పోపును ముందుగా వేడి చేసి సిద్ధంగా ఉంచిన పెరుగు– కొబ్బరి పేస్టు మిశ్రమంలో కలిపి, కొత్తిమీర చల్లి మూత పెట్టాలి. ఈ కేరళ వంట అన్నంలోకి రుచిగా ఉంటుంది.

గుజరాతీ కడీ



కావలసినవి: శనగపిండి– 4 టేబుల్ స్పూన్‌లు; అల్లం పచ్చిమిర్చి పేస్ట్– అర టేబుల్ స్పూన్ (అల్లం అంగుళం ముక్క, రెండు పచ్చిమిర్చి కలిపి గ్రైండ్ చేయాలి); తాజా పెరుగు – కప్పు ; బెల్లం లేదా చక్కెర – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నీరు – రెండున్నర కప్పులు.

పోపు కోసం: నూనె – టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర– అర టీ స్పూన్ ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; కరివేపాకు – ఒక రెమ్మ ; ఎండు మిర్చి – 2; మెంతులు – పావు టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, అల్లం-పచ్చిమిర్చి పేస్ట్, పెరుగు, బెల్లం, ఉప్పు వేసి బాగా చిలకాలి ● బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి పేలిన తర్వాత జీలకర్ర, దాల్చిన చెక్క, లవంగాలు, కరివేపాకు, ఎండు మిర్చి (విరిచి వేయాలి), మెంతులు, ఇంగువ వేసి దోరగా వేగిన తర్వాత స్టవ్ ఆపేయాలి. ఈ పోపును ముందుగా చిలికి పెట్టుకున్న పెరుగు – శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● ఇప్పుడు ఆ పాత్రను మీడియం మంట మీద ఉంచి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి కలుపుతూ మాడకుండా చూసుకోవాలి. శనగపిండి పచ్చి వాసన పోయిన తర్వాత మిశ్రమం మంచి రుచికరమైన వాసన వస్తుంటుంది. అప్పుడు కొత్తిమీర చల్లి దించేయాలి ● గుజరాతీ కడీని సూప్‌లాగ భోజనానికి ముందు తాగవచ్చు. అన్నంలో కలుపుకోవచ్చు, రోటీలోకి కూడా తినవచ్చు. ఇది వేసవి, శీతాకాలాల్లో కూడా ఆరోగ్యకరమైన ఆహారం.

కుకురార్



కావలసినవి: చికెన్ – అర కేజీ ; చిక్కటి పెరుగు – 5 టేబుల్ స్పూన్‌లు ; బంగాళ దుంప – 2 (ముక్కలుగా తరగాలి) ; అల్లం వెల్లుల్లి తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; ఉల్లిపాయలు – 3 (తరగాలి) ; ఆవ నూనె లేదా సాధారణ వంటనూనె – 5 టేబుల్ స్పూన్‌లు ; చక్కెర – చిటికెడు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి ; ఎండు మిర్చి– 5 ; పచ్చిమిర్చి– 3 (నిలువుగా చీరాలి) ; పసుపు – టీ స్పూన్ ; మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; గరం మసాలా పొడి – టీ స్పూన్ ; చికెన్ మసాలా పొడి– టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేయాలి. అందులో పసుపు, చికెన్ మసాలా పొడి, మిరప్పొడి వేసి మసాలా పొడులు చికెన్ ముక్కలకు బాగా పట్టేటట్లు కలిపి 20 నిమిషాల పాటు పక్కన ఉంచాలి ● ఈ లోపు ఒక బాణలిలో నూనె వేడి చేసి అందులో ఇంగువ, చక్కెర, ఎండు మిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. ఇవి చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులోనే పెరుగు కూడా వేసి సమంగా కలిసేటట్లు ఒకసారి తిప్పి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన పెట్టాలి ● ఉల్లిపాయలు వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో బంగాళా దుంప ముక్కలు వేయించి ఒక పాత్రలోకి తీసుకుని పక్కన ఉంచాలి. అదే బాణలిలో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేయించి తీసి పెట్టుకోవాలి ● ఇప్పుడు మిగిలిన నూనెలో మారినేట్ చేసిన చికెన్ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. చికెన్ ముక్కలు ఎర్రగా వచ్చేవరకు వేయించి అప్పుడు ఉప్పు వేసి ముక్కలకు పట్టేటట్లు కలపాలి. చికెన్ ముక్కల నుంచి నూనె వేరవుతున్న సమయంలో బంగాళాదుంప ముక్కలను వేయాలి. ఈ రెండింటినీ కలిపి పది నిమిషాల పాటు వేయించిన తర్వాత అందులో రెండు కప్పుల నీరు పోసి కలిపి మంట పెంచి ఉడకనివ్వాలి ● చికెన్ ఉడికేటప్పుడు అందులో ముందుగా వేయించి పెట్టుకున్న అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చితోపాటు గరం మసాలా పొడి, చిలికిన పెరుగు మిశ్రమాన్ని వేయాలి. ఇవన్నీ కలిసి ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర వేసి కలిపి దించేయాలి. ఈ కుకురార్ అస్సాం వాళ్ల వంట. అన్నం, రోటీల్లోకి రుచిగా ఉంటుంది.